నమస్తే తెలంగాణ
# జిందగీ
ఆదివారం | 8 జూన్ 2025
హైదరాబాద్ | www.ntnews.com




## మరీ అంత తేడానా..

**బాలీవుడ్** నటీనటుల పారితోషికాల్లో చాలా తేడా ఉంటున్నదని ఆరోపిస్తున్నది బాలీవుడ్ నటి వామికా గబ్బి. హీరోలే ఎక్కువమంది ప్రేక్షకులను ఆకర్షించగలరని నమ్మడమే ఇందుకు కారణమని చెబుతున్నది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. చిత్ర పరిశ్రమలో వేతన అంతరాన్ని ఎత్తి చూపింది. ఈ సందర్భంగా వామిక మాట్లాడుతూ.. ''స్టార్ హీరోల సినిమాలు కూడా విఫలమైన సందర్భాలు ఉంటాయి. మరి అలాంటప్పుడు వారి రెమ్యునరేషన్లను ఎందుకు పరిశీలించరు. వారి పారితోషికాన్ని ఎందుకు తగ్గించరు?'' అని ఘాటుగానే ప్రశ్నించింది. ఇదే హీరోయిన్ల విషయంలో జరిగితే.. వారి రెమ్యునరేషన్లను తగ్గిస్తారనీ, వారిపై విమర్శలు గుప్పిస్తారని చెప్పుకొచ్చింది. ''ఇండస్ట్రీలో నటీనటులకు అందించే పారితోషికాల్లో ఎంతో వ్యత్యాసం ఉన్నదనే వాస్తవం అందరికీ తెలియాలి. మగవారితో పోలిస్తే.. ఆడవాళ్లకు తక్కువ పారితోషికం లభిస్తున్నది. మీరు ఒక మహిళ అని.. మీకు తక్కువ జీతం వస్తుందనే భావన మీ మనసుల్ని మెలిపెడుతుంది. మగవాళ్లే ప్రేక్షకులను ఆకర్షించగరని దర్శకనిర్మాతలు నమ్మడమే దీనికి కారణం'' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.



ఇక బీటౌన్‌లో వేతన అంతరాన్ని ఎదుర్కోవడానికి తనదైన మార్గాన్ని కనుగొంటానని చెబుతున్నది వామిక. ''నేను సంతోషంగా ఉండేలా.. నా కోసం వేతన అంతరాన్ని తగ్గించుకునేలా సృజనాత్మక మార్గంలో పనిచేయాలని అనుకుంటున్నా!'' అని వెల్లడించింది. ఇక వామికా గబ్బి విషయానికి వస్తే.. చండీగఢ్‌లో పుట్టి పెరిగిందీ పంజాబీ బ్యూటీ. 'జబ్ వి మెట్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. సుధీర్‌బాబు హీరోగా 'భలే మంచిరోజు' చిత్రంతో తెలుగు సినిమాల్లోకీ ఎంట్రీ ఇచ్చింది. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం సహా పలు భాషల్లోనూ సినిమాలు చేసింది. 2023లో వచ్చిన 'ఖుఫియా' సినిమాతో.. దేశవ్యాప్తంగా పాపులారిటీ సంపాదించుకున్నది. బోల్డ్ సీన్స్‌తో.. యూత్ మొత్తాన్నీ తనవైపు తిప్పుకొన్నది. సోషల్ మీడియాలోనూ ఈ బ్యూటీకి మంచి ఫాలోయింగ్ ఉంది. అడివి శేష్ హీరోగా వస్తున్న 'గూఢచారి – 2'తో మళ్లీ తెలుగులో రీ ఎంట్రీ ఇవ్వనుంది.



## ఎంత గొప్పగా రాసినారే!

**ఈ నెల 12న సినారె వర్ధంతి**

**పద్యం కట్టి.. కవితలు రాసి.. గేయాలు దాటి.. గజల్స్ మీటి.. ఖండికలు సృజించి.. కావ్యాలు అల్లిన సవ్యసాచి మన తెలంగాణ ముద్దుబిడ్డ, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సింగిరెడ్డి నారాయణ రెడ్డి. ఆయన అక్షరతూలికలోంచి ఒలికిన సిరా చుక్కలు.. తెలుగు వాఙ్మయానికి ఆస్తులయ్యాయి. సాహిత్య వనంలో యథేచ్ఛగా విహరించిన ఈ కవికోకిల సినీ వాకిటా అంతే స్వేచ్ఛగా పాటలల్లింది. ఆయన ఏది రాసినా.. మన సినారె ఎంత గొప్పగా రాసినారే అనుకోవడమే పాఠకుల వంతైంది. తన అక్షర గవాక్షాలను తెరిచి అందరికీ విశ్వంభరను చూపిన సాహితీదీప్తి సినారె కొండంత సినీ'పాట'వం గురించి గోరంత ప్రస్తావించుకునే ప్రయత్నం ఇది..**




'కలల అలలపై తేలెను..
మనసు మల్లె పూవై...'

గులేబకావళి కథ సినిమా కోసం సినారె రాసిన మొట్టమొదటి పాట. రికార్డయిన మొదటి పాట 'నన్ను దోచుకొందువటే..'! కలల అలలపై పాట రెండో పంక్తి.. 'ఎగిసిపోదునో చెలియా.. నీవే ఇక నేనై..' అన్నారు కవి. అన్నట్టుగానే.. తెలుగు సినిమాల్లో ఈ పాటతో సినారె శకం మొదలైంది. తన మొదటి చిత్రంలో అన్ని పాటలూ తనకు రాసే అవకాశం ఇస్తే గానీ, సినిమా కవిగా ప్రస్థానం మొదలుపెట్టనన్నారట సినారె. ఆ అవకాశం ఎన్టీఆర్ ఇచ్చారు. ఇంకేముంది?! గులేబకావళి కథలో పదికి పదిపాటలు ఆయనే రాశారు. అన్నీ హిట్టే!!

**గులేబకావళి కథ** నుంచి అరుంధతి చిత్రంలోని 'జేజమ్మ మాయమ్మ' వరకు ఎన్నెన్నో పాటలు ప్రజల జేజేలు అందుకున్నాయి. జేజేలు అనగానే.. 'జోలా జోలమ్మ జోలా.. జేజేలా జోలా– సూత్రధారులు' పాట రాసింది మన సినారెనే! ఈ పాటను కొంటె మరదలితో పాడించి పెంకి బావను నిద్రపుచ్చిన ఈ కవిశ్రేష్ఠుడు.. చిట్టి చిన్నారులకు అమ్మ ప్రేమంత ఆప్యాయమైన లాలిపాటనూ అనుగ్రహించారు. అన్నమయ్య 'జో అచ్యుతానంద..' తర్వాత అంతటి జోలపాటగా చంటిపాపలకు చదివించారు. 'వటపత్ర శాయికి వరహాల లాలి..' పాటను కీర్తన అనడానికి సందేహం అక్కర్లేదు. ఈ లాలిపాట మొదటి చరణంలో పురాణ పురుషులను, వారి మాతృమూర్తులను ప్రస్తావించారు. రెండో చరణంలో దేవదేవుణ్ని కీర్తించిన వాగ్గేయకారులను స్మరించారు. తన లాలిపాటతో అమ్మలందరికీ దగ్గరైన సినారె.. అమ్మంటే ఏంటో ఎన్నో పాటల్లో తెలియపరిచారు. 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి..' అంటూ అన్న గొప్పదనాన్ని మరో పాటలో వివరించారు.

**సినారె** పాటలు నవపారిజాతాలు. రసరమ్య గీతాలు. లలిత రమణీయాలు. పదాలతో విన్యాసాలు చేయడమే కాదు.. తను ప్రయోగించిన ప్రతి పదానికీ సమర్థమైన భావం ప్రకటించగలగడం ఆయన ప్రత్యేకత. ఇందుకు ఉదాహరణే పూజాఫలము సినిమాలోని 'పగలే వెన్నెల.. జగమే ఊయల..'! జానకమ్మ ఎంత కమ్మగా పాడితే మాత్రం పగలే వెన్నెల ఎందుకొస్తుంది? ఏ ఎందుకు రాకూడదు.. 'కదలే ఊహలకే కన్నులుంటే..' అంటూ పాట రెండో పంక్తిలో సినారె ప్రయోగం చేశాక.. పగలేంటి? నిండు అమాస నాడు కూడా పండు వెన్నెల కురవకుండా ఉంటుందా?! ఇలాంటి భావాలు పొంగించడానికి మస్తిష్కంలో పాండిత్యం ఒక్కటుంటే సరిపోదు! మనసు పొరల్లో మధురానుభూతుల భావుకత వాహినిలా ప్రవహించాలి.

**'ఏకవీర'** సినారె కలం బలాన్ని తెలియజేసిన మరో చిత్రం. దీనికి కొన్ని పాటలు, అన్ని మాటలు ఆయనే అందించారు. ఈ సినిమా కోసం ఆయన రాసిన ఖండికలు సినీజనాలనే కాదు.. పండితులనూ అలరించాయి. 'ఏ పారిజాతమ్ములియ్యగలనో సఖీ.. గిరి మల్లికలు తప్ప గరిక పువ్వులు తప్ప..' అపురూపం. ఇందులోనిదే 'తోటలో నా రాజు తొంగి చూసెను నాడు..' ఈ పాటంతా రవ్వంత సడి లేకుండా రసరమ్యంగా సాగిపోతుంది. ఏకవీర విడుదలైన తర్వాత ఈ పాటను రాసింది భావకవి దేవులపల్లి అనుకొని, ఆయనకు ఉత్తరాలు కూడా రాశారట. తెలుగు సినిమాల్లో రాణించిన తెలంగాణ కవి దాశరథి.. తన అగ్రజుడని చెప్పే సినారె, దేవులపల్లిని గురుతుల్యుడిగా భావించేవారు.



**తెలుగు** సినిమా పాటకు కావ్య గౌరవం కట్టబెట్టిన అరుదైన గీత రచయితల్లో సినారె ఒకరు. లలిత గీతాలెన్నో రాశారు. దీర్ఘ సమాసాలతో నిండిన పాటలూ రాశారు. ఏ పంథా ఎంచుకున్నా.. దర్శకుడు చెప్పిన సన్నివేశాన్ని పదింతలు చేసేవారు. అనువాద చిత్రానికి పదునైన భావాన్ని స్వేచ్ఛగా తొడిగేవారు. 'కర్ణ' చిత్రంలో 'గాలికి కులమేది.. ఏదీ నేలకు కులమేది..' పాటలో 'పాలకు ఒకటే తెలి వర్ణం.. ఏదీ ప్రతిభకు కలదా స్థలభేదం' పంక్తులు కవి నారాయణ రెడ్డి సామాజిక స్పృహకు అద్దం పడుతుంది. కర్ణుడు అనగానే మన తెలుగు కౌంతేయుడు 'దానవీరశూర కర్ణ' గుర్తుకురాకుండా ఉండదు. ఈ సినిమాలో దర్శక నిర్మాత ఎన్టీఆర్‌కు దుర్యోధనుడికి డ్యూయెట్ పెట్టాలనే ఆలోచన వచ్చింది. అందరికీ చిత్రం అనిపించింది. కవి నారాయణరెడ్డికీ విచిత్రంగా తోచింది. ఆ రెండు పదాలే పాటకు మకుటం అయ్యాయి. 'బింబాధర మధురిమలూ.. బిగి కౌగిలి ఘుమఘుమలతో' సాగిపోయిన ఆ యుగళ గీతం 'భళారే విచిత్రం.. అయ్యారే విచిత్రం' అనిపించుకుంది.

### కొన్ని హిట్స్

- మబ్బులో ఏముంది.. నా మనసులో..
- చెలికాడు నిన్నే రమ్మని పిలువా..
- ఈ రేయి తీయనిది
- నా మది నిన్ను పిలిచింది
- శారద నను చేరగా
- గున్నమామిడి కొమ్మ మీద
- సిపాయి సిపాయి
- శ్రుతి నీవు గతి నీవు ఈ నా కృతి నీవు
- ఏ దేశమేగినా ఎందు కాలిడినా
- సువ్వి సువ్వి సువ్వాలమ్మా సీతాలమ్మా
- వాంగురే బంగారు రాజా..
- వస్తాడు నా రాజు ఈ రోజు..

**పౌరాణిక,** చారిత్రక చిత్రాల్లో మాత్రమే కాదు.. సాంఘిక చిత్రాల్లోనూ సంస్కృత దీర్ఘ సమాస గీతాలు రాశారు సినారె. విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'చెల్లెలి కాపురం'లో 'ఆడవే మయూరి..' ఆ కోవకు చెందినదే! 'చరణ కింకిణులు ఘల్లుఘల్లుమన..' అంటూ మొదలయ్యే ఆ గీతం మనోలతిక ఊగిపోయేంత ఉత్సాహంగా పల్లవిస్తుంది. 'సహస్ర ఫణి సంచలిత భూకృతుల' ప్రయోగానికి అర్థం తెలియకుండానే ఫణుల్లా తలలూపారు శ్రోతలు. వెయ్యి పడగల శేషుడు బుసకొట్టడం అన్న అర్థాన్ని అంత పకడ్బందీగా ప్రయోగించారు మన కవి. 'తూర్పు పడమర' సినిమా కోసం 'శివరంజనీ నవరాగిణి..' గీతంలోనూ సినారె మార్క్ కనిపిస్తుంది. పిల్ల యేరులా మొదలయ్యే ఈ గీతం రెండో చరణం అఖండ గోదారి ఉధృతిగా సాగిపోతుంది. ఇక సినారె పూర్తి సంస్కృత సమాసాలతో ఆవిష్కరించిన గీతం 'స్వాతికిరణం'లోని 'సంగీత సాహిత్య సమలంకృతే'. ఇందులో 'వేదవేదాంత వనవాసిని పూర్ణశశి హాసిని/ నాదనాదాంత పరివేశిని ఆత్మ సంభాషిణి.. వ్యాసవాల్మీకి వాగ్దాయిని' పంక్తులు జ్ఞాన సరస్వతికి ఈ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత చెల్లించిన కైమోడ్పుల్లా వినిపిస్తాయి.

**నారాయణరెడ్డి** పాటలు కర్పూర కళికలు. 'నిన్న లేని అందమేదో నిదురలేచెనెందుకో' పాటలో ప్రకృతి పరవశింపజేసిన తీరు.. ఇన్నాళ్లీ శోభలన్నీ ఎవరూ ఎందుకు రాయలేదనిపిస్తుంది. 'అమ్మను మించి దైవమున్నదా..' అమ్మ గురించి ఇంత కన్నా గొప్ప పాట ఉన్నదంటే నమ్మబుద్ధి కాదు. 'స్నేహమే నా జీవితం.. స్నేహమేరా శాశ్వతం..' స్నేహితుల పాలిట భగవద్గీతం. 'నీరాజనం'లోని 'నినుచూడక నేనుండలేను..' ఆ రోజుల్లో ప్రేమపక్షులకు కంఠోపాఠం. 'కనులు పలుకరించెను.. పెదవులు పులకించెను.. బుగ్గలపై లేత లేత సిగ్గులు చివురించెను..' బుగ్గకు సిగ్గును అంటగట్టిన తొలి ప్రయోగంగా ఈ పాటను చెబుతారు. సినారె రాసిన మూడున్నర వేల పాటల్లో ఎన్నని ఎంచుకోగలం, ఎంతని చెప్పుకోగలం. తెలుగు భాషా గరిమను చాటిన ఆయన సాహితీ సంపదకు ఏ మాత్రం తీసిపోవు సినారె సినీ గీతాలు కూడా! 'ఈ స్థాయికి తక్కువగా నేను రాయను' అని దర్శక నిర్మాతలకు నిర్మొహమాటంగా చెప్పి... మన పాట స్థాయిని ఆకాశమంత పెంచారు. రకరకాల సాహితీ ప్రక్రియల్లో తనదైన ముద్ర వేసినా.. పాటలు, గేయాలు రాయడమే తనకు ఇష్టమంటారు.

'ఎన్ని తెన్నుల కైత కన్నె విహరించిననూ పాటలోనే నాదు ప్రాణాలు గలవందు' అని ఆత్మీయంగా ప్రకటించుకున్న తెలంగాణ కవితా సిరి సింగిరెడ్డి నారాయణరెడ్డికి నమస్సుమాంజలులు.

... కణ్వస



## మా సింహాలు మళ్లీ విజృంభిస్తాయి!

**'ఐపీఎల్'** కప్‌ను కొట్టేందుకు తమ సింహాలు (ఆటగాళ్లు) రెట్టించిన ఆత్మవిశ్వాసంతో మళ్లీ వస్తారని అంటున్నది 'పంజాబ్ కింగ్స్' కో ఓనర్ ప్రీతీ జింటా. ఈ సీజన్‌లో మెరుగైన ఆటతీరు కనబరచిన పంజాబ్ జట్టు.. ఫైనల్‌లో ఓడిపోవడంతో ప్రీతి భావోద్వేగానికి గురైంది. తాజాగా.. 'ఐపీఎల్–2025'కు సంబంధించి తన ఇన్‌స్టా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ అభిమానులతో పంచుకున్నది. పంజాబ్ జట్టు సభ్యులతో కూడిన ఫొటోను.. పెద్ద అక్షరాలతో 'ధన్యవాదాలు' అంటూ షేర్ చేసింది. 'ఈ సీజన్ మేము కోరుకున్నట్లుగా ముగియలేదు. కానీ, ఈ ప్రయాణం అద్భుతంగా ఉంది. ఎంతో ఉత్తేజకరంగా.. వినోదాత్మకంగా.. స్ఫూర్తిదాయకంగా సాగింది. మా యువ జట్టు, మా సింహాలు (ఆటగాళ్లు) టోర్నీ మొత్తం చూపించిన పోరాటం, పట్టుదల నాకు ఎంతో నచ్చింది. ముఖ్యంగా మా కెప్టెన్ మా జట్టును నడిపించిన తీరు.. అన్‌క్యాప్డ్ ఆటగాళ్ల పోరాటం అద్భుతం' అంటూ రాసుకొచ్చింది. ఇక ఈ సీజన్ ప్రయాణం గురించి వివరిస్తూ.. 'ఈ సంవత్సరం ఎంతో ప్రత్యేకమైంది. గాయాలు, యుద్ధ భయాలతో కీలక ఆటగాళ్లను కోల్పోయినప్పటికీ.. టోర్నీలో విరామం వచ్చినప్పటికీ.. స్వరాష్ట్రాన్ని విడిచి వేరేచోట్ల ఆడినప్పటికీ.. స్టేడియం మొత్తం ఖాళీ చేసినప్పటికీ.. మేము రికార్డులను బద్దలు కొట్టాం! దశాబ్దం తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచాం. ఉత్తేజకరంగా సాగిన ఫైనల్‌లో.. చివరి వరకూ పోరాడాం' అంటూ చెప్పుకొచ్చింది. వచ్చే ఏడాది తమజట్టు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి వస్తుందని హామీ ఇచ్చింది ప్రీతి. 'టోర్నీ అంతటా ఇంతగొప్ప ప్రదర్శన చేసిన పంజాబ్ కింగ్స్‌లోని ప్రతి ఆటగాడికీ, సపోర్ట్ టీమ్‌కు చాలా ధన్యవాదాలు. అన్నిటికంటే ముఖ్యంగా మా షేర్ స్క్వాడ్ – మా అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు. కప్ గెలవడానికి మేము తిరిగి వస్తామని హామీ ఇస్తున్నాను. వచ్చే ఏడాది కలుద్దాం!' అంటూ ముగించింది. తాజాగా ముగిసిన 'ఐపీఎల్–2025'లో.. మెరుగైన ప్రదర్శన చేసింది పంజాబ్ జట్టు. గ్రూప్ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. ఫైనల్‌లో ఆర్సీబీ చేతిలో ఓడి.. త్రుటిలో కప్పును చేజార్చుకుంది.

## 35..

**తొలి చిత్రంతోనే దేశం మొత్తాన్నీ తనవైపు తిప్పుకొన్నది.. బాలీవుడ్ బ్యూటీ భాగ్యశ్రీ! 'మైనే ప్యార్‌కియా' అంటూ తెరంగేట్రం చేసిన ఈ మరాఠీ ముద్దుగుమ్మ.. ఒక్క సినిమాతోనే ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయింది. అంతలోనే అభిమానులందర్నీ ఆశ్చర్యపరుస్తూ.. తన చిన్ననాటి స్నేహితుడు, నటుడు, నిర్మాత అయిన హిమాలయ్ దాసానితో కలిసి పెళ్లిపీటలెక్కింది. తొలి సినిమా ఘనవిజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించకుండానే.. ఇల్లాలిగా కొత్త జీవితం ప్రారంభించింది. అయితే, పెళ్లి తర్వాత కూడా నటనను కొనసాగిస్తూ.. బీటౌన్‌లో టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. 56 ఏళ్ల వయసులోనూ ఏమాత్రం వన్నె తగ్గకుండా.. కుర్ర హీరోయిన్లకు పోటీ ఇచ్చేలా కనిపిస్తున్నది.**



**భాగ్యశ్రీ** – హిమాలయ దాసాని జంట మరోసారి నెట్టింట సందడి చేస్తున్నది. వీరి వివాహమై.. 35 ఏళ్లు దాటిపోయింది. అంతకుముందు కూడా వీళ్లమధ్య స్నేహం – ప్రేమ నడిచింది. అయితే.. ఇన్నేళ్లలో దాసాని ఎప్పుడూ భాగ్యశ్రీకి ప్రపోజ్ చేయలేదట. ఇటీవలే భాగ్యశ్రీ ఎదుట హిమాలయ్ దాసాని మోకాళ్లపై కూర్చొని ప్రపోజ్ చేశాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది భాగ్యశ్రీ. వాటికింద.. 'హబ్బీ ప్రపోజల్!' అంటూ క్యాప్షన్ పెట్టింది. 'ఈ ఫొటోలు చూసి మా ఆయన ఎంతో రొమాంటిక్ అని అందరూ అనుకుంటారు. కానీ, ఈ క్షణాలు అంత తొందరగా రాలేదు. పెళ్లికి ముందు కానీ, 35 ఏళ్ల వివాహ జీవితంలో కానీ.. ఆయనెప్పుడూ నాకు ప్రపోజ్ చేయలేదు. ఈ విషయం ఆయనతో ఎన్నోసార్లు అన్నాను. చివరికి.. ఆ సమయం రానేవచ్చింది' అంటూ.. తన భర్త హిమాలయ్ తనకు ఎలా ప్రపోజ్ చేశాడో పంచుకున్నది. భాగ్యశ్రీ ఫొటోషూట్‌లో ఉన్నప్పుడు సడెన్‌గా ఎంట్రీ ఇచ్చిన దాసాని.. మోకాళ్లపై కూర్చొని భార్యకు ప్రేమగా ప్రపోజ్ చేశాడు. అక్కడే ఉన్న భాగ్యశ్రీ ఫొటోగ్రాఫర్.. ఆ ఆనందకరమైన క్షణాలను కెమెరాలో బంధించాడు. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా.. వాటిని చూసిన భాగ్యశ్రీ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటూ కామెంట్లు పెడుతున్నారు. మైనే ప్యార్ కియా.. 'ప్రేమ పావురాలు'గా తెలుగులో అనువాదం కాగా, ఇక్కడా అభిమానులను సంపాదించుకున్నది భాగ్యశ్రీ. బాలీవుడ్‌తోపాటు దక్షిణాదిలోనూ అడపాదడపా సినిమాలు చేసింది. తెలుగులో ఓంకారం, యువరత్న రాణా చిత్రాల్లో నటించింది. 'రాధేశ్యామ్'లో ప్రభాస్‌కు తల్లిగా నటించి.. మరోసారి టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది. భాగ్యశ్రీ – హిమాలయ్ దాసాని జంటకు ఇద్దరు పిల్లలు. కొడుకు అభిమన్యు దాసాని 2019లో వచ్చిన 'మర్ద్ కో దర్ద్ నహీ హోతా' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాడు. ఉత్తమ అరంగేట్ర నటుడిగా ఫిలింఫేర్ అవార్డును అందుకున్నాడు. ఇక కుమార్తె అవంతిక దాసాని.. 2022లో 'మిథ్య' అనే వెబ్‌సిరీస్‌తో ఇండస్ట్రీలోకి వచ్చింది.